క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

సంజామల: వర్షకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సంజామల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులకు శుక్రవారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వర్షకాలంలో మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని సూచించారు. దోమల వల్లే వైరల్ ఫీవర్లు వస్తాయన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నారాయణదాసు, హెల్త్ సూపర్‌వైజర్ పుల్లయ్య, ప్రిన్సిపాల్ శ్రీలేఖ పాల్గొన్నారు.

పొగాకు దుష్పరిణామాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలపై కొలిమిగుండ్ల మోడల్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. కౌమారదశలో ఉత్పన్నమయ్యే సమస్యలు, నేటి సమాజంలో ఎదురయ్యే సమస్యలు వివరించి వాటిని ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాముడు, ఉపాధ్యాయులు రాధారాణి, శిరీషా, అరుణ, గంగాదేవి, శివశంకర్, గోవిందు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నె మెట్ట సమీపంలో ప్రకృతిపీఠం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పంచమహాయజ్ఞముల ఆలయ నిర్మాణానికి శుక్రవారం దాతలు విరాళమందించారు. కోవెలకుంట్ల మండలం వల్లంపాడుకు చెందిన మాజీ సర్పంచ్ బూజూట ఓబుళపతిరెడ్డి, రమణమ్మ దంపతులు రూ. 10 వేల చెక్కును పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డికి అందజేశారు.

మూగబోయిన 'ముందస్తు సమాచారం'

అవుకు(కొలిమిగుండ్ల): ప్రయాణికుల కోసం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ముందస్తు సమాచారం అందించే సిస్టం మూగబోయింది. దాదాపు నాలుగు నెలల నుంచి అది పని చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి బస్సులు అవుకు పట్టణానికి కిలో మీటర్ దూరంలో ఉండగానే సంబంధిత బస్సు కండక్టర్ మిస్డ్‌కాల్ ఇవ్వగానే త్వరలో బస్సు వస్తుందని వాయిస్ వినిపిస్తుంది. ఈవిధానం వల్ల విద్యార్థులు, సాధారణ ప్రయాణికులకు బస్సు ఎప్పుడు వస్తుందనే విషయం స్పష్టంగా తెలుస్తుండేది. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుని ఎప్పటిలాగే ముందస్తు సమాచారం సిస్టంను వాడుకలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



3కె రన్‌లో పాల్గొన్న వారితో అధికారులు

డోన్ టౌన్: ప్రతి ఒక్కరూ ఉదయం నడవడం, పరిగెత్తడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, డాక్టర్ సుంకన్న అన్నారు. శుక్రవారం డోన్ పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద నుంచి గుత్తి రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు నిర్వహించిన 3కె రన్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ కొంత సమయం కేటాయించి వ్యాయామం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, విద్యార్థులు, రోటరీ క్లబ్ సభ్యులు, స్ఫూర్తి సేవా సమితి సభ్యులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.






కోవెలకుంట్ల: చిన్నకొప్పెర్ల వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న కైపవాగు,కోవెలకుంట్ల- లింగాల రహదారిలో ప్రవహిస్తున్న చిన్నవంచెవాగు, **సంజామల:** ముచ్చలపురి గ్రామంలో నీటమునిగిన వరిపంట, వల్లంపాడు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగు

వాగులకు పోటెత్తిన వరద

- కొనసాగుతున్న వర్షాలు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- నీట మునిగిన వరి, మినుము



సంజామలలో ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగు,



కంపమల్ల సమీపంలో నీట మునిగిన వరి

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల నుంచి స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వివిధ వాగులకు వరదనీరు పోటెత్తడంతో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం సబ్ డివిజన్‌లోని ఉయ్యాలవాడ మండలంలో అత్యధికంగా 40.6 మి.మీ, సంజామలలో 25.2 మి.మీ, కోవెలకుంట్లలో 23 మి.మీ, అవుకులో 19.4 మి.మీ, దొర్నిపాడులో 13.4 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షాలతో కోవెలకుంట్ల- లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో చిన్నకొప్పెర్ల వద్ద కై పవాగు, వల్లంపాడు సమీపంలో నల్ల, చిన్నవంచెవాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఈ రహదారిలో రెండు రోజుల నుంచి రాకపోకలు స్తంభించిపోయాయి. కంపమల్ల సమీపంలో కుందరవాగుకు అనుసంధానంగా ఉన్న కాటన్ వంక ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో వరి నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లింది.

సంజామలలో 25.2 మీ.మీ వర్షపాతం

సంజామల: మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగాయి. గురువారం 30 మి.మీ, శుక్రవారం 25.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కోవెలకుంట్ల-అవుకు, కోవెలకుంట్ల-తిమ్మనాయినిపేట తిరిగే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. అవుకు మండలం శివవరం, హొత్రమాన్ దిన్నె, కమలపురి, ముదిగేడు, ముచ్చలపురి, సంజామల మీదుగా వెళ్లే పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. ముక్కమల్ల, ఆకుమల్ల, ఆల్వకొండ, కమలపురి, వసంతాపురం తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో కోవెలకుంట్ల ప్రైవేట్ పాఠశాలలు సెలవు ప్రకటించాయి. ఆయా గ్రామాల్లో మినుము, వరి, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు నీట మునిగాయి. మండలంలో 265 హెక్టార్లలో వరి, మినుము తదితర పంటలు నీట మునిగాయని మండల వ్యవసాయాధికారి భూమ జ్యోతి అంచనా వేశారు.

ఘనంగా హిందీ దివస్



మాట్లాడుతున్న రామలింగారెడ్డి

కోవెలకుంట్ల: సెప్టెంబర్ 14వ తేదీ హిందీ దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్, హిందీ అధ్యాపకుడు రామలింగారెడ్డి హిందీభాష చారిత్రక నేపథ్యం, భవిష్యత్తులో విద్యార్థులకు హిందీభాష అవసరాన్ని వివరించారు. భారతదేశ అధికార భాషగా హిందీని స్వీకరించిన రోజును ఏటా హిందీ దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. జాతీయ ఏకీకరణలో హిందీభాష ప్రాముఖ్యత ఎంతో ఉందని, విద్యార్థులు హిందీని నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, అన్నపూర్ణ, రామసుబ్బారెడ్డి, రమణారెడ్డి, క్రిష్ణదాసు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కొత్త పద్ధతులతోనే అధిక దిగుబడులు



సీతారామాపురంలో ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్, అధికారులు

బేతంచెర్ల: మారుతున్న కాలనుగుణంగా టమాట, ఉల్లి పంటల సాగులో ఆధునిక పద్ధతులను అవలంబిస్తే పెట్టుబడులు తగ్గడమే కాకుండా నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు రైతులకు సూచించారు. శుక్రవారం బేతంచర్ల మండలంలోని సీతారామాపురం గ్రామంలో రైతులు రామేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి సాగు చేసిన ఉల్లి, టమాట పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉల్లి పంటను కోసిన తరువాత బాగా ఆరబెట్టి, ఉల్లికాడలను కత్తిరించి, గ్రేడింగ్ చేసుకుని మార్కెటింగ్ చేయాలని సూచించారు. అలాగే సాగులో కొత్త పద్ధతులను పాటించడంతోపాటు మార్కెటింగ్‌పై కూడా రైతులు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఉల్లి ధర క్వింటాకు రూ.800–900 మాత్రమే ఉండడంతో గిట్టుబాటు కష్టమైందని, టమాట కూడా కేజీ రూ.10–12కు పడిపోయిందని రైతులు వెల్లడించారు. సీతారామాపురంలో చామంతి పూల సాగు అధికంగా జరుగుతోందని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని, ఈ విషయంలో గ్రామ ఉద్యాన సహాయకుడు గిరిధర్ నిర్లక్ష్యం వహించవద్దని డైరెక్టర్ హెచ్చరించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు శ్రీరామాంజనేయులు, నాగరాజు, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ, ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



మాజీ ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు తెలుపుతున్న మల్లు సురేందర్‌రెడ్డి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని నివాసంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన మల్లు సురేందర్‌రెడ్డి కాటసానిని కలిశారు. దుశ్శాలువాతో సన్మానించి, బొకే అందజేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీ ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రస్థాయి పదవి రావడంపై సురేందర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, దీనికి కారణమైన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశానికి హాజరైతే సమస్యలకు పరిష్కారం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: మండల సర్వసభ్య సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరై గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలను సభ దృష్టికి తీసుకురావాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సరిపడా యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఆందోళన అవసరం లేదన్నారు. ప్రైవేట్ ఎరువుల డీలర్లపై వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షణ పెంచి అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బస్టాండ్ వద్ద ఆక్రమించుకున్న షాపులపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సభకు హాజరుకాని సభ్యులు, అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఏఓ నాగరాజును ఆదేశించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ విభాగాలకు సంబంధించిన పనులను సభ దృష్టికి తీసుకొచ్చారు. అయితే తగిన కోరం లేకపోవడంతో సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, పీఆర్‌డీఈ నాగశ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, హౌసింగ్ డీఈఈ కృష్ణారెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బార్ లైసెన్స్‌లకు దరఖాస్తు గడువు పొడిగింపు

డోన్ టౌన్: డోన్‌లో రెండు బార్ లైసెన్స్‌ల జారీ కోసం దరఖాస్తు గడువును పొడిగించినట్లు డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఓపెన్ క్యాటగిరి–1, గీత కార్మికుల క్యాటగిరి–1 చొప్పున బార్ లైసెన్స్‌లు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని.. వివరాల కోసం స్థానిక కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

కూలిన మట్టి మిద్దెలు

బనగానపల్లె రూరల్: మండలంలోని చిన్నరాజుపాళెం గ్రామంలో మట్టిమిద్దె కూలింది. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సుధాకర్, వరాలు దంపతులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మట్టి మిద్దె బాగా తడిచిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం మట్టి రాలుతుండడంతో అప్రమత్తమై బయటకు వచ్చేశారు. కొంతసేపటికే మట్టిమిద్దె కూలిపోయింది. ఇంట్లో ఉన్న రూ.1.30 లక్షల విలువైన వస్తువులు, సామగ్రి ధ్వంసమైనట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



చిన్నరాజుపాళెం గ్రామంలో కూలిన మట్టిమిద్దె

- **బేతంచెర్ల:** మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో దూదేకుల హుస్సేన్ మట్టి మిద్దె శుక్రవారం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, ఫర్నీచర్ ధ్వంసమై నష్టం వటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

టీడీపీ నాయకులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

డోన్ టౌన్: డోన్ టీడీపీలో వర్గపోరు కొనసాగుతోంది. నాయకులు చేస్తున్న అక్రమాలను బట్టబయలు చేస్తూ అదే పార్టీ నాయకులు, మరికొందరు ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మల్యాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రహ్లాద, గ్రామ తలారి నరసింహుడుతో కలిసి ప్రభుత్వ భూములను విక్రయిస్తూ గ్రామస్తుల మధ్య మనస్పర్థలు రేకెత్తిస్తున్నారని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, గ్రామస్తులు తలారి చిన్న ధర్మేంద్ర, మన్నెక వినోద్‌కుమార్, సుమన్, మధు తదితరులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక అతిథి గృహంలో ఎమ్మెల్యేను కలిసి వారి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. అలాగే పట్టణంలోని కోట్ల హరిసర్వోత్తమరెడ్డి కాలనీలో సర్వే నంబర్ 510లో 120 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేయగా వాటిని కొందరు టీడీపీ కార్యకర్తలు కబ్జా చేసి నిరుపేదలను బెదిరిస్తూ నిర్మాణాలను అడ్డుకుంటున్నారని పట్టణానికి చెందిన ఈశ్వర్‌నాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

రేషన్ డీలర్ రాజీనామా

కోవెలకుంట్ల: మండలంలోని గుంజలపాడుకు చెందిన రేషన్ డీలర్ వీరమ్మ శుక్రవారం రాజీనామా చేశారు. ఈమె దివ్యాంగురాలు కాగా కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని తహసీల్దార్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన మేకల సుబ్బారాయుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. బుధవారం సుబ్బారాయుడు గొండ పనిమీద గోనవరం గ్రామానికి వెళ్లి తిరిగి సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో బనగానపల్లె వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుబ్బారాయుడు తీవ్ర గాయాలపాలవడంతో 108 అంబులెన్స్ ద్వారా నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని చెప్పారు. బాధితుడి కుమారుడు విజయకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. కొత్త బస్టాండ్, డేవిడ్ నగర్, కేయీ మాదన్ననగర్, వెంకటనాయునిపల్లె రోడ్డు, ఇందిరానగర్, శ్రీకృష్ణనగర్, పండరీనగర్, కురుకుందకాలనీ, పాతపేట, తారకరామనగర్, సుందర్‌సింగ్‌కాలనీ, పాతబస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాలక మండలి సభ్యుల నియామకం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ పాలక మండలి సభ్యులను ప్రభుత్వం నియమించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. సభ్యులుగా పి.సేతురామ నాగార్జునరెడ్డి, చింతా శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, సి.రాజేశ్వరి, హారిక, కుళ్లాయమ్మ, బి.శశికళ, వి.శారద, వై.లోకేష్, సుదర్శనరావు, డి.బాలదస్తగిరిలతో పాటు ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా కె.రామకృష్ణశర్మలను నియమించారని వెల్లడించారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

కోవెలకుంట్ల: కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన ఐచర్ లారీ డ్రైవర్ కోవెలకుంట్ల సమీపంలో గురువారం అర్ధరాత్రి గుండెపోటుకు గురై మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. ఆ జిల్లాకు చెందిన జాన్‌రాజ్, కో డ్రైవర్ శివతో కలిసి డోన్ నియోజకవర్గం ప్యాపిలిలో ధాన్యం బస్తాలను లోడ్ చేసుకునేందుకు బయలుదేరారు. లారీ కోవెలకుంట్లకు చేరుకోగా అర్ధరాత్రి కావడంతో లారీ పక్కకు నిలిపి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున జాన్‌రాజ్‌ను నిద్రలేపినా ఉలుకు పలుకు లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ నరసింహులు

డోన్ టౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, దీనికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని అడ్వయిజరీ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథార్టీ కమిటీ చైర్మన్, ఆర్డీఓ నరసింహులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. మొదటి తప్పు చేస్తే 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తామని, రెండవసారి చేస్తే 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే వైద్యులు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే మొదటిసారి 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా, రెండోసారి చేస్తే 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1 లక్ష జరిమానాతో పాటు వైద్య ధ్రువీకరణ పత్రం, భారత వైద్య మండలి సభ్యత్వం కూడా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. స్కానింగ్ కేంద్ర నిర్వాహకులు ప్రతి సంవత్సరం లైసెన్స్ రిన్యువల్ చేయించుకోవాలని, కేంద్రం అడ్రస్ మార్పులు ఉంటే వెంటనే తెలియజేయాలని, ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సమాజంలో ఆడ శిశువును రక్షించడం అందరి బాధ్యత అని, దీనిపై సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రభుత్వ వైద్యులు సూర్యప్రకాష్, ప్రవీణ్, కిరణ్, సీడీపీఓ శంషాద్‌బేగం, డీసీపీఓ స్వప్న, న్యాయవాది మధుసూదన్ రెడ్డి, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ, ఏఈ నాగరాజు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాఘవేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులను విజయవంతం చేద్దాం



బుక్‌లెట్‌లను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

డోన్ టౌన్: స్థానిక పాతపేట అమ్మవారిశాలలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి, ప్రార్థన సంఘం, ఆవోపా సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొట్రికె హరికిషన్ ఆధ్వర్యంలో బుక్‌లెట్లను విడుదల చేశారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

పాలేరు వాగు వద్ద లీకేజీలు అరికట్టాలి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏఓ, చిత్రంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి

అవుకు (కొలిమిగుండ్ల): అవుకు రిజర్వాయర్‌కు అనుసంధానమైన పాలేరు వాగు వద్ద చాలాకాలంగా అవుతున్న నీటి లీకేజీని అరికట్టాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలు చర్చకు వచ్చాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ తదితర శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షణ చేయాలని ఎంఈఓ శ్రీధర్‌రావుకు ఎంపీపీ సూచించారు. యూరియా లభ్యతపై రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎంత మేర పంపిణీ జరిగిందీ, ఇంకా ఎంత అవసరమో వ్యవసాయాధికారి ఖలీమున్నీసాను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వరి సాగులో రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో విషజ్వరాలు విస్తరిస్తున్నందున మురుగునీటి కాల్వలు శుభ్రం చేసి, ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. పాలేరు వద్ద స్లూయిజ్ దెబ్బతిన్నదని, తిమ్మరాజు చెరువులో కూడా నీరు వృథా అవుతోందని ఎస్సార్బీసీ డీఈ సుబ్బారావు దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి మట్టం, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోపై వివరాలు ఆరా తీశారు. నిచ్చెనమెట్ల, చిన్నకొట్టాల గ్రామాల రైతులకు ఇప్పటివరకు ఒక్క యూరియా ప్యాకెట్ కూడా అందలేదని ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి సమావేశంలో ప్రస్తావించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామప్ప, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మల్లిఖార్జునరెడ్డి, ఎంఈఓ శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఓ ప్రైవేట్ కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులకు తాగునీటికి ఇబ్బంది ఉందని పేర్కొన్నారు.